# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ గ్రామాలను అభివృద్ధి చేయడమే పల్లె పండుగ కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు నింపేందుకు 'దీపం 2.0' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.

================

మహిళలు అన్ని వేళలా ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబుబాబు నాయుడు అన్నారు. దీపం-2.0లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఈరోజు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... డ్వాక్రా సంఘాలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తామని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

================

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినం తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకని, తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం గొప్పదని, ఆయనను ప్రతి

ఆంధ్రుడు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. తిరుపతిలో స్థానిక రుయా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. శ్రీకాకుళంలో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములకు నివాళులు అర్పించారు.

================

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 'దీపం 2.0' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె, పవన్ కళ్యాణ్ అన్నారు. ఏలూరు జిల్లా జగన్నాథ పురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పద్ధకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాల అమలు ప్రస్తుత ప్రభుత్వంలో సక్రమంగా జరుగుతోందన్నారు. ''కూటమి ప్రభుత్వం భాద్యతగల ప్రభుత్వం అని, మహిళల భద్రత విషయంలో రాజీపడబోమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

================

ఏలూరులో బాణసంచా తీసుకెళ్తుండగా పేలుడు సంభవించి మృతి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులను సమాచార, పౌరసంబందాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ఈరోజు పరామర్శించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... దీపావళి పండగ రోజున ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. పార్టీ తరఫున లక్ష రూపాయలు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 2 లక్షల రూపాయల పరిహారాన్ని, అలాగే మృతుడి భార్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ... పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు.

================

వచ్చే సంక్రాంతి నాటికి 4 వేల 500 కోట్ల రూపాయలతో పల్లె పండుగ కార్యక్రమలో ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు పూర్తి చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం కాపవరం, వాలమర్రు, అరట కట్ల గ్రామాల్లో "పల్లె పండుగ"లో భాగంగా 2 కోట్ల రూపాయల విలువైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపు లైన్ల నిర్మాణ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

విరామం

================

రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. దీనిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, అనంతపురం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, కృష్ణా, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు లబ్దిదారులకు పింఛన్ల నగదును పంపిణీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, విజయనగరంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రకాశం జిల్లాలోని కారుమంచి గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయస్వామి, చిత్తూరులో రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, నెల్లూరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర లబ్దిదారులకు పింఛన్లను అందజేశారు. అలాగే నంద్యాల జిల్లా కలుగోట్ల గ్రామములో రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి పింఛన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

================

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు విశాఖపట్నం - విజయవాడ మధ్య 16 జన్ సాధారణ (అన్ రిజర్వుడ్) రైళ్లను నడుపుతున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు ఈరోజు నుంచి అందుబాటులోకి వచ్చాయి. విశాఖపట్నం - విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ 1, 3, 4, 6, 8, 10, 11, 13 తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే, విజయవాడ – విశాఖ ఈ ప్రత్యేక రైలు విజయవాడలో సాయంత్రం 6 గంటల 30 నిమిషాల బయల్దేరి రాత్రి 12 గంటల 35 నిమిషాలకు విశాఖ చేరుకోనుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

================

“గోదావరి హారతి”ని విజయవంతం అయ్యేవిధంగా అధికారులు కృషి చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన జరగనున్న “గోదావరి హారతి” ఆహ్వాన పత్రికలను కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావులతో ఆర్డీవో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో శాఖల వారిగా కేటాయించిన ఏర్పాట్లు పటిష్టవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హారతికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించమన్నారు. పురపాలక సంఘం అధికా రులు త్రాగునీరు, శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని సూచించారు.

================

నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న దక్షిణాంధ్రప్రదేశ్ తీరంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని, ఇది సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుండి 5.8 కిలోమీటర్లు మధ్య విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ రోజు, రేపు ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే రాయలసీమ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలియజేసింది.

================

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (APCRDA) ఒప్పంద ప్రాతిపదికన రిమోట్ సెన్సింగ్ అసిస్టెంట్, ప్లానింగ్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఎలాంటి రాత పరీక్ష ఉండని ఈ పోస్టుల భర్తీకి విద్యార్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు విజయవాడ, అమరావతిలో పని చేయవల్సి ఉంటుంది. ఇతర వివరాలు అధికారిక ప్రకటనను చూడవచ్చు.

================

ఈనెల 13వ తేదీన కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని ఘనంగా నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. కైశిక ద్వాదశి రోజు వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగించనున్నట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది.

=================

=================